సాక్షి నారాయణపేట

మంగళవారం । 20 । మే । 2025



పులకరించిన కొండారెడ్డిపల్లి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు
- ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సీఎం దంపతులు, మంత్రులు

- వంగూరు

- వివరాలు 8లో...

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /22.8

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం మేఘావృతమవుతుంది.



నల్లమల డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారులు షబ్బీర్‌అలీ, వేం నరేందర్‌రెడ్డి

పాలమూరు బాధ్యత నాదే

ఇందిర సౌర జల వికాసం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రత్యేక ప్రణాళికతో సంక్షేమ పథకాలకు నిధులు
- ఈ ప్రాంత బిడ్డగా నా బాధ్యత మరింత పెరిగింది
- విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాం
- స్వగ్రామం కొండారెడ్డిపల్లిలోనూ పర్యటన.. ఘన స్వాగతం పలికిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట: 'ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి నాదే బాధ్యత. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలను గెలిపించి.. నాపై విశ్వాసాన్ని చూపి ఆశీర్వదించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మీ ముందు నిలబడే అవకాశం దక్కింది. నా బాధ్యత మరింత పెరిగింది. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి, నిధులు విడుదల చేస్తా. విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాను' అని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిర సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించారు. మాచారంలోని చెంచు రైతుల పోడు భూముల్లోకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్, ప్లాంటేషన్, స్ప్రింక్లర్లు, డ్రిప్ వ్యవస్థలను పరిశీలించారు. గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. 'పాలమూరు బిడ్డలు అంటేనే తట్ట, పార పని.. ముంబయి, పుణె వలస వెళ్లి కష్టపడేవాళ్లని అందరికీ తెలుసు. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు బిడ్డలే కావాలి. దేశం నలుమూలలా భూములను సస్యశ్యామలం చేసేందుకు మన బిడ్డలు రక్తాన్ని చెమటగా మార్చి కష్టపడుతున్నారు. నేను పాలమూరు బిడ్డను అని చెప్పుకునేందుకు గర్వపడుతున్నా. ఎవరైనా నేను పాలమూరుకు చెందిన వాడినని చెప్పినప్పుడు నా గుండె ఉప్పొంగుతుంది' అని పేర్కొన్నారు.



సభావేదిక వద్దకు నడిచి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

నా సొంత గడ్డ అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా. నియోజకవర్గంలోని రైతులు గిరిజన, గిరిజనేతరులు అనే తేడా లేకుండా రైతులందరికీ ఉచితంగా సోలార్ పంప్‌సెట్లను ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గంలో ఎన్ని మోటార్లు అవసరమైనా ఉచితంగా అందిస్తాం. సోలార్ విద్యుత్ ద్వారా నెలనెలా రూ.6 వేల వరకు ఆదాయం పొందేలా చర్యలు చేపడతాం. రానున్న వంద రోజుల్లోనే అందరికీ సోలార్ విద్యుత్ అందించి దేశానికి మోడల్‌గా తీర్చిదిద్దుతాం. వ్యవసాయ, గృహ వినియోగానికి సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తూ అదనపు విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తామని, ఇందుకోసం ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని డిప్యూటీ సీఎంకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మేం కోరినట్లు వంశీకృష్ణను గెలిపించి మీ మాట నిలబెట్టుకున్నారు.. ఇప్పుడు నా బాధ్యతగా అచ్చంపేట అభివృద్ధికి కావాల్సిన ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తే నిధులు మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారు. స్వంత నియోజకవర్గం నల్లమలలో సాగునీరు, విద్య, ఉపాధి, రోడ్లు, ఇతర అవసరాలను తీర్చడంలో ఎమ్మెల్యేకు ఎంత బాధ్యత ఉందో నాకు అంతే ఉందని సీఎం అన్నారు.

పాలమూరు బిడ్డల సత్తాచాటాం..

పాలమూరు బిడ్డకు పాలన చేత కాదని ప్రచారం చేశారు. కేవలం 16 నెలల్లోనే రాష్ట్రాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపి పాలమూరు బిడ్డల సత్తాచాటాం. తట్టా, పారలతోనే కాదు పాలనలోనూ సమర్థులమని నిరూపించామని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మహిళా సంఘాలకు 600 అద్దె బస్సులు అప్పగించామన్నారు. నారాయణపేటలో మహిళా సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని, తద్వారా మహిళలు అంబానీ, అదానీలతో పోటీపడేలా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డాక్టర్ శరత్, కలెక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సైడ్‌లైట్స్

- ఉదయం 11.50 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చేరుకున్నారు.
- 11.55 గంటలకు సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారుల బృందం స్వాగతం పలికారు.
- 11.58 గంటలకు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన **సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు**
- **మధ్యాహ్నం 12.06 నిమిషాలకు ఇందిర** సౌర గిరి **జల వికాసం పథకం పైలాన్‌ను ఆవిష్క**రించారు.
- **12.08 గంటలకు స్విచ్ ఆన్ చేయగా.. స్ప్రింక్లర్లు ప్రారంభయ్యాయి.**
- **12.12 గంటలకు కరపత్రాలు విడుదల** చేశారు.
- **12.14 గంటలకు పొలంలోని స్ప్రింక్లర్ల** దగ్గరకు వెళ్లి **29 మంది లబ్ధిదారులతో మాట్లాడారు.**
- **12.16 గంటలకు లబ్ధిదారులు సీఎంకు** పుష్పగుచ్ఛాలు **అందించారు.**
- 12.20 గంటలకు ఓ లబ్ధిదారు సీఎంకు తేనె సీసా అందించింది.
- 12.21 గంటలకు లబ్ధిదారు ఉడుతనూరి అలివేలతో ముచ్చటించారు. మరో లబ్ధిదారు లింగమ్మతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరోసారి అచ్చంపేటకు వస్తానని సీఎం వారికి చెప్పారు.
- 12.40 గంటలకు మాచారం శ్రీసీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- 1.02 గంటలకు బహిరంగ సభావేదిక వద్దకు చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేశారు.
- 2.45 గంటల వరకు దాదాపు 33 నిమిషాల పాటు సీఎం ప్రసంగించారు. అనంతరం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి రోడ్డు మార్గాన తిరిగి బయలు దేరారు.



ఇందిర సౌర గిరి జలవికాసం పథకం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు

నల్లమల సాక్షిగా మాటిస్తున్నా.. భట్టి విక్రమార్క

తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలు భూమి, స్వేచ్ఛ కోసమే.. ఆ నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలని. ప్రజలు ఇదే కోరుకుంటున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇక్కడ ప్రకటించిన నల్లమల డిక్లరేషన్ తూ.చ. తప్పకుండా అమలు చేస్తామన్నారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయబోతున్నామన్నారు. తమది పేదల ప్రభుత్వమని ఈ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో యావత్ క్యాబినెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నల్లమల సాక్షిగా మాట ఇస్తున్నానని పేర్కొన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఓ ఉమ్మడి కుటుంబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించబోతున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం గురించి ఆలోచించారే గానీ.. విద్య గురించి పట్టించుకోలేదని దుయ్యబట్టారు.



మాచారం బహిరంగ సభకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

బీసీ రిజర్వేషన్లు పెంచాలి



నారాయణపేట రూరల్: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు అనుకూలంగా మాట్లాడుతూనే నామినేటెడ్ పోస్టులలో బీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ల నియామకంలో బీసీలకు చోటు కల్పించకుండా దగా చేశారని దుయ్యబట్టారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, గణేష్, అశోక్, నరేష్, లక్ష్మన్న, గజలప్ప, వెంకటప్ప, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు న్యాయం చేస్తాం



మాగనూర్: మాగనూర్ మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో పనిచేసే బీపీఎం ధనుంజయ్ అవినీతిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఖాతాదారులకు న్యాయం చేస్తామని విచారణ అధికారి, జిల్లా తపాలా ఇన్‌స్పెక్టర్ జుబేర్ అన్నారు. సోమవారం జిల్లా తపాలా ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ప్రత్యూష, ఉమకాంతు మండల కేంద్రంలో ఇంటింటి విచారణ చేపట్టారు. ఖాతాదారుల నుంచి రాతపూర్వకంగా అన్ని వివరాలు సేకరించారు. వారి నగదును వడ్డీతో సహా చెల్లిస్తామని ఖాతాదారులకు హామీ ఇచ్చారు. ఇదిలాఉండగా, సుకన్య సమృద్ధి యోజన కింద మధ్య తరగతికి చెందిన ఎంతో మంది నెల నెల మాగనూర్ పోస్టాఫీస్‌లో నగదు చెల్లించేవారు. ఈక్రమంలో అదే పోస్టాఫీస్‌లో బీపీఎంగా పనిచేసే ధనుంజయ్ చేతివాటం ప్రదర్శించి ఎంతోమంది ఇచ్చిన డబ్బును పోస్టాఫీస్ ఖాతాల్లో జమ చేయకుండా తన జేబు నింపుకొన్నాడు. ఇటీవల ఈ విషయం బయటకు రాగా.. ఖాతాదారులు పోస్టాఫీసు ఎదుట గతంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని పలు పరీక్ష కేంద్రాల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. వీసీ శ్రీనివాస్ జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, వాసవీ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థి వెళ్లే క్రమంలో తప్పకుండా హాల్‌టికెట్‌తో పాటు ఒక గుర్తింపు కార్డును పరిశీలించిన అనంతరం కేంద్రంలోనికి అనుమతించాలని ఆదేశించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని సూచించారు. సెమిస్టర్-4కు సంబంధించి మొత్తం 8,142 మంది విద్యార్థులకు 7,859 మంది విద్యార్థులు హాజరై 283 గైర్హాజరయ్యారు. సెమిస్టర్-5కు సంబంధించి 467 మంది విద్యార్థులు 435 మంది హాజరై 32 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు.

పెసర క్వింటాల్ రూ.7,359

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పెసర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,359, కనిష్ఠంగా రూ.6,069 ధర పలికింది. అలాగే, వేరుశనగ గరిష్ఠంగా రూ.4,119, కనిష్ఠంగా రూ.3,319, జొన్నలు గరిష్ఠంగా రూ.3,801, కనిష్ఠంగా రూ.3,611, వడ్లు హంస గరిష్ఠంగా రూ.1,750, కనిష్ఠంగా రూ.1,351, వడ్లు సోన గరిష్ఠంగా రూ.2,076, కనిష్ఠంగా రూ.1,639, తెల్ల కందులు గరిష్ఠం, కనిష్ఠంగా రూ.6,859 ధర పలికాయి.

నిరుద్యోగులకు ఉపాధి

'భూ భారతి'లో భాగంగా క్షేత్రస్థాయి భూ సర్వేకు ప్రభుత్వం నిర్ణయం

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా అడుగులు..
- లైసెన్సుడ్ సర్వేయర్ శిక్షణ పొందేందుకు అర్హులకు అవకాశం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 1,449 మంది దరఖాస్తులు



జిల్లాలో భూ సర్వే చేపడుతున్న సర్వేయర్ (ఫైల్)

సర్వేయర్ల కొరత తీరనుంది

భూ భారతి చట్టం అమలు నేపథ్యంలో సర్వేయర్ల కొరత తీర్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన వారికి లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ ఇవ్వనుంది. ఎంపికైన సర్వేయర్లతో ప్రైవేట్ భూములకు సంబంధించి సమస్యలు పరిష్కరించనున్నారు. భూ కొలతలకు వారిని వినియోగించుకోనున్నారు.

– గిరిధర్, జిల్లా సర్వే అధికారి, నారాయణపేట

నారాయణపేట/నారాయణపేట రూరల్: భూ వివాద రహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. దీనిని అమలు చేసేందుకు ఇప్పటికే పైలెట్ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. వ్యవసాయ భూములకు కచ్చితమైన హద్దులు నిర్ణయించి భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోంది. నక్ష ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించడంతో ఆమేరకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. అయితే, ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో అర్హులైన యువతకు శిక్షణ ఇచ్చి లైసెన్స్ సర్వేయర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించి దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1449 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో.. ఓసీలు 54 మంది, బీసీలు 850, ఎస్సీలు 388, ఎస్టీలు 157 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలిస్తారని రెవెన్యూ అధికార యంత్రాంగం పేర్కొంది. ఈ వారంలోనే శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి 50 రోజుల శిక్షణ అనంతరం జులై చివరి నాటికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. శిక్షణ పూర్తి అయితే వీరికి మెరుగైన ఉపాధి లభించనుంది.

నక్ష ఆధారంగా రిజిస్ట్రేషన్లు..

భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి వ్యవసాయ క్షేత్రానికి హద్దులు నిర్ణయించే భూపటం (నక్ష) ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు భూ భారతి చట్టం అమలులో నక్ష ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఆ మేరకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. భూ వివాదాల పరిష్కారంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి చూపించే దిశగా లైసెన్స్ కలిగిన సర్వేయర్ల నియామకానికి చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. శనివారం అర్ధరాత్రి వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 1449 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నిజాం పాలనలోని సర్వే వివరాలే కొలమానం

జిల్లాలో నిజాం పాలనలో సేత్వార్ పేరిట 1938, 1945 మధ్యకాలంలో సర్వే నిర్వహించారు. అప్పట్లో రెవెన్యూ గ్రామాల వారీగా వాటాదారుల సమాచారంతో ఖాస్రా పహాణీ తయారు చేసి అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం ఏర్పడ్డాక వాటినే కొలమానంగా రెవెన్యూ శాఖ పరిగణిస్తూ వస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాస్రా పహాణీ ఆధారంగా భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం కొనసాగించింది. భూ హద్దులను గుర్తించేలా సర్వే చేయకపోవడంతో వివాదాలు అలాగే కొనసాగుతూ వస్తున్నాయి. వీటి శాశ్వత పరిష్కారం దిశగా భూ సర్వేకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రభుత్వ భూముల సర్వేకు ప్రభుత్వ సర్వేయర్లు ఉన్నా ప్రైవేట్ వ్యక్తులకు భూ క్రయ విక్రయాల సమయంలో నక్ష సమర్పించాలనే నిబంధన పెట్టడంతో సర్వేయర్లకు ప్రాధాన్యం పెరిగింది.

50 రోజులపాటు శిక్షణ

ఇంటర్‌లో గణితం ఓ సబ్జెక్టుగా ఉండి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్(సివిల్), బీటెక్ సివిల్, పాలిటెక్నిక్ డిప్లొమా సివిల్ కోర్సులు చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మీసేవ ద్వారా ఓసీలు రూ.10 వేలు, బీసీలు రూ.5 వేలు ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 చెల్లించారు. వీరిలో నుంచి నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేసి 50 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం రాత పరీక్ష నిర్వహిస్తారు. థియరీ, టిప్పన్, ప్లాటింగ్, ఫీల్డ్ వర్క్ తదితర మూడు విభాగాల్లో శిక్షణ తీసుకొని తదుపరి నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్వేయర్ సర్టిఫికెట్ అందజేస్తారు. భవిష్యత్‌లో భూ భారతి ద్వారా దరఖాస్తు చేసుకున్న బాధితులు సర్వేకు సంబంధించిన సమస్య పరిష్కారానికి, నక్ష వేయించుకోవడానికి ఈ ధ్రువపత్రం కలిగిన వారు ఇచ్చేవి మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలిలా..

జిల్లా	ఓసీ	బీసీ	ఎస్సీ	ఎస్టీ	మొత్తం
నారాయణపేట	13	152	45	9	219
మహబూబ్‌నగర్	12	164	47	45	268
జోగుళాంబగద్వాల	11	169	102	3	285
నాగర్‌కర్నూల్	9	226	144	78	457
వనపర్తి	9	139	50	22	220
మొత్తం	54	850	388	157	1,449

బాల్య వివాహాలు పూర్తిస్థాయిలో నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిస్థాయిలో నివారించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలు, మండలాల వారిగా సమావేశాలు నిర్వహింపజేసి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, తహసీల్దార్లు, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకోవాలన్నారు. ఇకపై జరిగే పెళ్లిళ్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 2025లో 24 బాల్య వివాహాలను ఆపామని చైల్డ్‌హెల్ప్‌లైన్ జిల్లా సమన్వయకర్త నర్సింహులు తెలిపారు. అంతకుముందు అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శాఖ పరంగా బాల్య వివాహాల నివారణకు చేపట్టిన చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. సమావేశంలో డీఎస్పీ లింగయ్య, ఆర్డీఓ మొగులప్ప, డీపీఓ సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్, సిడబ్ల్యూసి చైర్మన్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు అనుమతులు

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్, స్కానింగ్, ల్యాబ్‌ల ఏర్పాటు అనుమతి కోసం 21 దరఖాస్తులు రాగా.. నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 పై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్, వైద్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ధ్రువపత్రాలు, స్టాంపింగ్, ఫైర్‌సేఫ్టీ, బయోమెడికల్, నోటరీ, బిల్డింగ్ కండిషన్ అన్ని నిబంధనలను పాటించి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి మొత్తం 27 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

పోలీస్ ప్రజావాణికి 9 అర్జీలు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 9 అర్జీలు అందాయి. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించాల్సిందిగా ఆయా సీఐ, ఎస్ఐలకు ఫోన్‌లో సూచించారు. భూ తగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా రెవెన్యూ అధికారుల సమన్వయంతో సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని, ఎలాంటి ఆవేశాలకు లోనుకారదని సూచించారు.

పులకరించిన కొండారెడ్డిపల్లి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు
- ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సీఎం దంపతులు, మంత్రులు


ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ తదితరులు

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి రెండోసారి రావడంతో గ్రామస్తులు పులకరించిపోయారు. సోమవారం సాయంత్రం కొండారెడ్డిపల్లికి చేరుకున్న సీఎంకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు భాజాభజంత్రీలతో స్వాగతం పలికారు. ఆంజనేయస్వామి ఆలయంలో సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి దంపతులు ఆంజనేయస్వామి, శివుడికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పండితులు ముఖ్యమంత్రి దంపతులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆశీర్వచనం చేసి శాలువాలతో సత్కరించారు. ముఖ్యమంత్రి సొంత నిధులతో ఆలయాన్ని అద్భుతంగా నిర్మించడం అభినందనీయమని పలువురు మంత్రులు కొనియాడారు. అనంతరం ముఖ్యమంత్రి నివాసంలో ప్రత్యేకంగా చేసిన వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ముందుగా మంత్రులు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లగా.. కొంత ఆలస్యంగా ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

మండల అభివృద్ధికి నిధులు..

వంగూరు మండల అభివృద్ధి కోసం పెద్ద మొత్తంలో నిధులు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొండారెడ్డిపల్లిలో సీఎంను ఎమ్మెల్యే వంశీకృష్ణ, రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ కలిసి మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. రూ. 100కోట్లతో కొండారెడ్డిపల్లి నుంచి హాజీపూర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం, పలు గ్రామాల్లో రూ. 12కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంతో పాటు విద్య, వైద్యానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని వారు సీఎం దృష్టికి తెచ్చారు. అన్నింటినీ పరిశీలించి నిధులు మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. కాగా, కొండారెడ్డిపల్లికి చెందిన వందన గీసిన ముఖ్యమంత్రి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లాలూ యాదవ్, వంశీ తదితరులు ఉన్నారు.

గిరిజన రైతులకు చేయూత

అచ్చంపేట/ మన్ననూర్: దేశంలోనే తొలిసారిగా గిరిజన రైతులకు చేయూత అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిర సౌర జల వికాస పథకానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర మంత్రులు అభిప్రాయపడ్డారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో పథకం ప్రారంభోత్సవ బహిరంగ సభలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. గత పాలకులు రూ.8 లక్షల కోట్లు అప్పులు చేసి.. మిగులు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ధ్వజమెత్తారు. ఇందుకోసం రూ.60 కోట్ల వడ్డీలు కడుతున్నామని, వీరి హామీలన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పేదల కోసం ఏదైనా చేసిందంటే కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

2.10 లక్షల మందికి లబ్ధి : మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రభుత్వం ప్రారంభించిన ఇందిర సౌర జల వికాస పథకంతో రాష్ట్రంలోని 2.10 లక్షల మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరనుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రతి గిరిజన రైతును అన్ని విధాలుగా ఆదుకోవాలనేదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకుల హామీలు ప్రకటనలకే పరిమితయ్యాయని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం 16 నెలల వ్యవధిలోనే అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే : మంత్రి దామోదర రాజనర్సింహ



గిరిజనుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచాలనేదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని కొనియాడారు. భూ భారతితో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. దీని వలన ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. దళితులకు సమన్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ఎస్సీ వర్గీకరణ చేసి.. అమలు చేస్తున్న ఘనత తమదేనన్నారు.

గిరిజనులకు ప్రత్యేక హక్కులు : మంత్రి సీతక్క



నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న గిరిజనులకు రాజ్యాంగం ద్వారా ప్రత్యేక హక్కులు లభించాయని మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఐటీడీఏలను నిర్వీర్యం చేసిందన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని సీఎంను కోరారు. దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇస్తే.. ప్రస్తుత ప్రభుత్వం సౌర విద్యుత్ కల్పిస్తూ పండ్ల తోటలకు అవకాశం కల్పించిందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ గిరిజనుల భూములు లాక్కొని కేసులు పెట్టారని ఆరోపించారు.

నల్లమల డిక్లరేషన్ అమలు చేస్తాం : ఎంపీ మల్లు రవి



ప్రభుత్వం ప్రారంభించిన ఇందిర సౌర జల వికాస పథకంపై 10 అంశాలతో అమలు చేసే విధంగా నల్లమల డిక్లరేషన్ చేశామని ఎంపీ మల్లు రవి అన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తూనే కొత్త పథకాలు తీసుకొస్తున్నామన్నారు. ప్రజల మనసులో ఉన్న పథకాలను సీఎం గ్రహించి తీసుకొస్తున్నారని చెప్పారు.

చెన్నకేశవ రిజర్వాయర్‌కు నిధులు

సాగునీటికి నోచుకోని అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించే చెన్నకేశవ రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయాలని, మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి కేంద్రంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరారు. నల్లమలను టూరిజం హబ్‌గా, రూ.వంద కోట్లతో పట్టణాభివృద్ధితోపాటు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



నేటి నుంచి షా-అలీ-పహిల్వాన్ ఉత్సవాలు


షా-అలీ-పహిల్వాన్ దర్గా ముఖ ద్వారం


షా-అలీ-పహిల్వాన్ సర్ ముబారక్ దర్గా

- రేపు దర్గాలలో గంధోత్సవం
- 21 చిన్న కిస్తీలు, 22న పెద్ద కిస్తీలు

అలంపూర్: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే అలంపూర్ షా-అలీ-పహిల్వాన్ ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉర్సు ఉత్సవాలకు షా-అలీ పహిల్వాన్ దర్గాలు ముస్తాబు అవుతున్నాయి. పట్టణంలో వెలిసిన షా-అలీ-పహిల్వాన్ సర్ ముబారక్, ధడ్ ముబారక్ దర్గాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానుండటంతో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధికారికంగా జరిగే ఈ ఉత్సవాలకు అన్ని శాఖల ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాటు చేస్తున్నారు.

23 వరకు ఉత్సవాలు..

షా-అలీ-పహిల్వాన్ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నెల 20న రాత్రి గంధోత్సవం ఉంటుంది. రాత్రి సయ్యద్ ఖాదర్ వలి సాహెబ్ ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయం గంధం తీసుకెళ్లడం జరుగుతుంది. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి గంధంను సర్ ముబారక్ దర్గాకు భక్తజనసందోహం మధ్య ఊరేగింపుగా తీసుకెళ్తారు. సర్ ముబారక్ దర్గాలో గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చివరగా ధడ్ ముబారక్ దర్గాలకు గంధంను తీసుకెళ్లి ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. 21న సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీలు జరగనున్నాయి. 22న ధడ్ ముబారక్ దర్గా వద్ద పెద్ద కిస్తీలు నిర్వహిస్తారు. పెద్ద కిస్తీపోటీలను వీక్షించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. 23న ప్రత్యేక ఉత్సవాలతో ముగుస్తాయి.

గుల్బర్గా నుంచి గంధం రాక..

షా-అలీ-పహిల్వాన్ ఉర్సు గంధోత్సవంతో ప్రారంభం అవుతుంది. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ఖాజా బందేనవాజ్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ముగిసిన అనంతరం అక్కడి నుంచి గంధంను అలంపూర్‌కు తీసుకరావడం జరుగుతుంది. గుల్బర్గా దర్గా నుంచి వచ్చే గంధంను సయ్యద్ ఖాదర్ బాషా ఇంటికి చేరుతుంది. దీంతో షా-అలీ-పహిల్వాన్ ఉత్సవాలను ప్రారంభిస్తారు. షా-అలీ-పహిల్వాన్ ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలి


అభివాదం చేస్తున్న వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అనంతవిష్ణు, నాయకులు

- 119 స్థానాల్లో జై మహాభారత్ పార్టీ పోటీ
- వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అనంతవిష్ణు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జై మహాభారత్ పార్టీ సత్తా చాటుతుందని, ఆ దిశగా కార్యచరణ రూపొందిస్తున్నట్లు జై మహాభారత్ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అనంతవిష్ణు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా క్లబ్ మీటింగ్‌హాల్లో ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జిల్లాల వారీగా కార్యవర్గాలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ తరుపున అభ్యర్థులను పోటీలో పెట్టనున్నట్లు తెలిపారు. తమ పార్టీ ఎజెండాల్లో ముఖ్యమైనది రైతాంగానికి కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సంపూర్ణ ఉచిత విద్య, వైద్యం పేదలకు అందుబాటులోకి తేవాలన్నారు. రాష్ట్రంలోని గోదావరి, కృష్ణ, తుంగభద్ర నదులను అనుసంధానం చేసి సాగు, తాగు నీళ్ల సమస్యకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జై మహాభారత్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చెన్నప్పగారి రఘోత్తంరెడ్డి, కో ఇన్‌చార్జి అనుప రామాంజనేయులు, ఉమ్మడి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నిజామొద్దీన్, కో ఆర్డినేటర్లు చెన్నయ్య, జిల్లా ఆర్గనైజర్ వహీద్ పాల్గొన్నారు.

48 గంటలైనా లభించని ఆచూకీ


భీమానదిలో గాలింపు చర్యలు చేపడుతున్న జాలర్లు

- తీవ్ర ఆవేదనలో కుటుంబ సభ్యులు
- అటవీ అధికారులకు వినతి

కృష్ణా: భీమానదిలో మొసలి దాడికి గురైన రైతు ఆచూకీ కోసం అధికారులు చేస్తున్న ప్రయత్నాలు వృథా అయ్యాయి. మండలంలోని కుసుమర్తిలోని భీమానదిలో రైతు జింకల్ తిప్పన్నపై శనివారం మొసలి దాడి చేసి ఈడ్చుకెళ్లిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో అటవీ శాఖ, మక్తల్ సీఐ రాంలాల్ ఆధ్వర్యంలో , రెవెన్యూ అధికారులు సోమవారం స్థానిక జాలర్ల సాయంతో నదిలో తిప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 48 గంటలైనా తిప్పన్న ఆచూకీ లభించక పోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌గౌడ్, నాగేంద్ర, సంతోష్‌పాటీల్, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు బోల్తా

- ముగ్గురు ప్రయాణికులకు గాయాలు


పాలెం సమీపంలో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

కొత్తకోట రూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమంటూ అధికారులు ఓవైపు ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఆర్టీసీ బస్సులో ప్రయాణికులందరూ గాఢనిద్రలో ఉండగా.. ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రయాణికులకు ఏం జరిగిందో తెలియక రక్షించాలంటూ కేకలు వేశారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ వివరాల మేరకు.. పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి కడప నుంచి సికింద్రాబాద్‌కు 37మంది ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యంలోని పాలెం సమీపంలోకి బస్సు రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ప్రయాణికులు నారాయణ, శిల్ప, తరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. బస్సు సాధారణ స్పీడ్‌లో ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నవ వధువు అనుమానాస్పద మృతి

మద్దూరు/కొత్తపల్లి: అనుమానాస్పద స్థితిలో నవ వధువు మృతిచెందిన ఘటన కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కడపని స్వామితో కోయిలకొండ మండలం మల్కాపూర్‌కు చెందిన జ్యోతి(19)కి గత నెల 20న వివాహం జరిగింది. పెళ్లి తర్వాత జ్యోతి తల్లి గారింటికి వెళ్లి అక్కడ పదిరోజులు ఉండి ఈ నెల 14న ఎక్కమేడ్‌కు వచ్చింది. ఈ నెల 18న రాత్రి పడుకున్న తర్వాత ఆకస్మికంగా మృతిచెందగా ఈ విషయాన్ని స్వామి చిన్నాన్న చంద్రప్ప మృతురాలి బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామస్తులు పెద్దఎత్తున ఎక్కమేడ్‌లోని స్వామి ఇంటికి చేరుకోగా కోస్గి ఎస్‌ఐ బాలరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కుమార్తె మృతిపై అనుమానం ఉందని తండ్రి గుర్రాల కుశలప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఉస్మాన్ వివరించారు.

ఇంట్రా టూ డే లీగ్‌లో ప్రతిభ చాటాలి

ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్


డేవిడ్ క్రిపాల్ (210 పరుగులు నాటౌట్)


షాదాబ్ అహ్మద్ (111 పరుగులు)


ఎండీ ముఖిత్ (5 వికెట్లు)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఔత్సాహిక క్రీడాకారుల కోసం మొదటిసారిగా హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లు ప్రారంభించిందని, ఈ టోర్నీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో అండర్-23 పురుషుల ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్ సోమవారం ప్రారంభమైంది. రాజశేఖర్ క్రీడా జట్లను పరిచయం చేసుకొని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. జట్లకు ఎంపికైన ప్రతి క్రీడాకారుడికి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ వ్యక్తిగత ప్రదర్శనను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లలో రాణించే క్రీడాకారులకు త్వరలో జరిగే హెచ్‌సీఏ టోర్నమెంట్‌లో పాల్గొనే ఎండీసీఏ జట్లకు ఎంపిక చేస్తామని అన్నారు. ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లు ప్రారంభించిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, ఆబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌కు భారీ ఆధిక్యం

- డేవిడ్ క్రిపాల్ డబుల్, షాదాబ్ సెంచరీలు

సమర్థ స్కూల్ మైదానంలో మహబూబ్‌నగర్-జడ్చర్ల మధ్య జరగిన టూడే లీగ్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన జడ్చర్ల జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో సంజయ్ 70, కేతన్ కుమార్ 32 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్ ముఖిత్ 15 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. మిగతా బౌలర్లు షాదాబ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 420 పరుగుల భారీ స్కోర్ చేసి 255 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. జట్టులో డేవిడ్ క్రిపాల్ రాయ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అజేయ డబుల్ సెంచరీ చేశాడు. 151 బంతుల్లో 13 సిక్స్‌లు, 16 ఫోర్లతో 220 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ షాదాబ్ అహ్మద్ 72 బంతుల్లో 10 సిక్స్‌లు, 7 ఫోర్లతో 111 పరుగులు చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 270 పరుగులు భాగస్వామ్యాన్ని నమోదు చేయడం విశేషం. నేడు (మంగళవారం) రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

జాతీయ గోగేమ్ టోర్నీలో క్రీడాకారులకు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: బిహార్ రాష్ట్రం ఆరాలో ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు జరిగిన జాతీయ స్థాయి గోగేమ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి మూడు బంగారు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ సింగిల్స్‌లో జిల్లా క్రీడాకారుడు పి.రాజేష్ ఫైనల్ మ్యాచ్‌లో 40-30 స్కోర్‌తో బిహార్ క్రీడాకారుడిపై, మరో క్రీడాకారుడు మహ్మద్ బషీరుద్దీన్ ఫైనల్ మ్యాచ్‌లో 16-03 స్కోర్‌తో ఒడిశా క్రీడాకారుడిపై, జూనియర్ సింగిల్స్‌లో మహ్మద్ రయ్యాన్ నజం ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు క్రీడాకారుడిపై 17-9 స్కోర్‌తో గెలుపొంది బంగారు పతకలు సాధించారు. పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులను తెలంగాణ గోగేమ్ అసోసియేషన్ నసరుల్లా హైదర్, ప్రధాన కార్యదర్శి గులాం అఫ్రోజ్, కోశాధికారి వినోద్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షులు మహ్మద్ షకీల్ అహ్మద్, సభ్యులు అభినందించారు.

నాందేడ్‌లో చెంచు మహిళ మృతి

అలస్యంగా వెలుగు చూసిన ఘటన


కవిత (ఫైల్)

బల్మూర్: ఆదివాసి చెంచు మహిళ వలస వెళ్లి మహారాష్ట్రలోని నాందేడ్‌లో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని బాణాలకు చెందిన నల్లబోతుల లింగస్వామి లింగాల మండలం అప్పాయిపల్లికి చెందిన కవిత (26)ను రెండు నెలల కిందట వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు అప్పాయిపల్లికి చెందిన గుంపు మేస్త్రీ అర్జున్‌తో రూ.60 వేలు అడ్వాన్స్ తీసుకొని బాణాలకు చెందిన మరికొందరితో కలిసి మహారాష్ట్రలోని నాందేడ్‌కు పనికి వెళ్లారు. ఈ నెల 15న పని ప్రదేశంలో కవిత బావిలో పడి మృతి చెందడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. భర్త, అత్త చిట్టెమ్మ అక్కడ పని చేస్తున్న మరో ఇద్దరు మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చి ఈ నెల 17న శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా కవిత తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా 12 ఏళ్ల సోదరుడు గణేష్ ఉన్నారు. అతడి సంరక్షణకుగాను రూ.75 వేలు గుంపుమేస్త్రీ ఇచ్చేలా మధ్యవర్తులు ఒప్పందం కుదుర్చారు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత గుంపు మేస్త్రీ తమను పట్టించుకోవడం లేదని.. ఇస్తానని రూ.75 వేలు కూడా ఇవ్వడం లేదని లింగస్వామి, అతడి తల్లి చిట్టెమ్మ వాపోతున్నారు.

గుంపు మేస్త్రీ చెరలో 33 మంది చెంచులు..

అప్పాయిపల్లికి చెందిన గుంపు మేస్త్రీ అర్జున్ లింగాల మండలంలోని శ్రీరంగాపూర్, బల్మూర్ మండలంలోని బాణాల నుంచి 33 మంది చెంచులను అడ్వాన్సులు ఇచ్చి మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఓ కంపెనీలో సిమెంట్, కాంక్రీట్ పనులు చేసేందుకు తీసుకెళ్లాడని బాధితులు విలేకర్లకు తెలిపారు. వెళ్లే సమయంలో రోజు కూలి రూ.500 ఇస్తామని చెప్పి అక్కడికి వెళ్లాక నెలకు కేవలం రూ.7 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. అంతేగాకుండా నెలలో రెండ్రోజులు మాత్రమే సెలవులిస్తూ.. నాసిరకంగా భోజనం అందిస్తున్నారని వివరించారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి కవిత మృతిపై అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు గుంపు మేస్త్రీపై కఠిన చర్యలు తీసుకోని అక్కడి చెంచులను స్వగ్రామాలకు తీసుకొచ్చి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

భూవివాదంపై తల్లీకూతుళ్ల ఆందోళన

- న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయింపు


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న తల్లీకూతుళ్లు

గట్టు: భూవివాదంపై తల్లీకూతుర్లు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన ఘటన సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. ఆలూరు గ్రామానికి చెందిన రాణి తన భర్త సవారన్న మరణాంతరం గ్రామ శివారులో సర్వే నంబర్ 183/డీ1, 188/డీ1, 189/జీలో 1.32 ఎకరాల పొలాన్ని తన పేరున మార్చుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇట్టి పొలాన్ని సాగు చేసేందుకు వెళ్లగా తన మరిది మల్లేష్ సాగు చేయకుండా అడ్డుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కొంత కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాణి కుమార్తె మంజుల, మనవళ్లతో కలసి న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా, పోలీసులు పట్టించుకోక పోవడంతో గట్టు- మాచర్ల రోడ్డుపై బైటాయించి సోమవారం ఆందోళన చేశారు. అదే విధంగా తన వాటాకు రావాల్సిన మరో 7.18 ఎకరాల భూమిని మరిది మల్లేష్ తన పేరున మార్చుకొని అన్యాయం చేసినట్లు ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని, మరిది మల్లేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు భూ వివాదంపై విచారణ చేపడుతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. స్థానికంగా నివాసముంటున్న మెకానిక్ రాముడు, రంజాన్‌బీ, గౌరమ్మ, లక్ష్మయ్య, వేణుగోపాల్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు పిచ్చికుక్కను కర్రలతో దాడి చేసి చంపేశారు. అనంతరం బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.